# నీడ

"అసలు మనవాళ్ళింత సాహసానికి పూను కోకుండా ఉండాల్సింది" చైతన్య అన్నాడు.

"పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్టు. అగ్రరాజ్యాలతో సమానంగా మనమూ అణ్వాస్త్రాలు తయారు చేయాలనుకోవటం అవివేకుడు" అన్నాడు సురేష్.

"నన్నడిగితే ఏదో అయిందేదో అయిపోయింది. వాళ్ళున్నట్లు సి.టి.బి.టి. మీద సంతకం చేసేస్తే బెటరూ..గొప్పలకు పోకుండా" అన్నాడు అవినాష్.

అర్ధగంట నుంచి ఈ రకంగా ఆ కుర్రాళ్ళు మాట్లాడు కుంటున్న మాటలన్నీ వింటున్నాడుదేవయ్య. వాళ్ళలో దేశభక్తి ఉన్నందున. సంతోషించాడు. కానీ లోకానుభవం చాలదనిపించింది.

అతనికి తన జీవితం కళ్ళ ముందు కదిలింది.

ఇంటి కొస్తూనే బావురుమన్నాడు వీరయ్య. మట్టికుండ దభీ మనిపడి నీళ్ళన్నీ వాలికి పెంకులు చెల్లా చెదురైనట్లు - రాగానే పెద్ద ఆక్రందనలతో నేల మీదపడి కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ.

"ఏటయిందిరా? ఎవులేటన్నార్రా? సెప్పురా? ఆ ఎనకేడుద్దువు గానీ! వాళ్ళ నాయనమ్మ ఆందోళనగా వాణ్ని దగ్గరకు తీకుంది. ఒళ్ళంతా నిమిరింది. తుళ్లిపడింది. వాడి వొళ్ళు కాలిపోతోంది.

" అయ్యో! దేవా ఈడొల్లు కాలిపోతున్నాదిరా! బేగిరవణయ్య గోరి కాడికి తీసుకెళ్ళి ఇండీసన్ పొడిపించురా!" అంది. అంతలోనే వీపు మీద తట్లుచూసి, "ఏట్రా? ఈ దద్దుర్లేటిరా?" అంటూండగానే ఇంట్లోంచి కోడలు ఎర్రమ్మ " ఓర్నాయినో, నా కొడుకుని సంపేసిన్నార్రో! ఈల్ల సేతులు పడిపోనూ, ఈల్ల కాల్లు కాట్లో బుగ్గయిపోనూ!" అని శాపనార్థాలు పెట్టటం మొదలెట్టింది.

దేవయ్య కొడుకును దగ్గరకు తీసుకుని "ఈ దెబ్బలేట్రా? అసలేటి జరిగిందయ్యా! సెప్పూ.. సెప్పురయ్యా! కొడుకు భుజాలు పట్టుకుని ఊపుతూ అడిగాడు.

వీరయ్య చెప్పలేక చెప్పలేక చెప్పిన కథ సారాంశం ఇది. ఊర్లో బంగారమ్మ పండగ జరిగింది. చుట్టాలు పక్కాలతో ఊరు కిటకిటలాడింది. తోటిపిల్లలతో ఆటపాటలలో పడిన వీరయ్య శివయ్య ఇంటికి పనికెళ్ళలేదు. దేవయ్య రెండు మూడు సార్లు హెచ్చరించినా వెళ్తున్నానని గెడ్డకి పిల్లలతో స్నానాకి వెళ్లిపోయాడు. మూడో రోజు తప్పని సరై పనిలోకెళ్ళాడు. వీడింకా అడుగుపెట్టనే లేదు.

"ఏరా! ఊరందరికీ పండు గెల్లి మూడ్రోజులయినా - నీకు మీ అయ్యకి పన్లోకెల్లాలనియాదస్తునేదా? మీ యబ్బబాబు గోరి సొమ్మను కున్నావ ట్రా? మూడువేల పట్టుకుపోయిండు. నెలకు నాలుగ రోజులు నువ్వుఎగ్గొట్టెస్తున్నావు ఎవుల్నో పెట్టుకుంటాం". ఎల్లు మీ అయ్యను రమ్మను పని మానీ అని అన్నాడు శివయ్య ఆకలితో మీదపడబోతున్న బెబ్బులిలా కనిపించాడు. బిక్కచచ్చిపోయాడు. చీపురుతీసికసవలు ఊడ్చాలా, వెళ్ళిపోవాలా అని ఆలోచిస్తున్నాడు.

అంతలో వాడికి తన పెదనాన్నకొడుకురాముడు అన్న మాటలు గుర్తుకొచ్చాయి. " ఒరే ఈరిగా ఈ ఒక్కపూట మీ అయ్యకి డుబుకీ కొట్టీసివచ్చీరా! పెద్ద సెర్లో ఇయ్యాల ఈతపోటీలెట్టుకుందాం. మజ్జేన్నం సిడతాబిల్ల ఆడుకుందాం. వెంటనే వెనుదిరిగాడు

" ఏట్రా? ఎలిపోమంటెలిపోవడమేనేటి? ఎలిపోవాలనే వచ్చినావేట్రా? ఇయ్యాల నువ్వింటికెల్లానికిల్లేదు. మీ అయ్యొస్తే- అటో ఇటో తేల్చిపారేస్తాను. ఆకసవలెత్తి బక్కలకు కుడితి పెట్టు. ఏటలాగసూత్తావేటి? బేగినే" అని గట్టిగా కసిరాడు.

వాడుస్తంభంలా నిలబడిపోయాడు. శివయ్య ఎన్ని కేకలేసినా ఎంతఅరచినా వాడిలో చలనంలేదు. "ఏట్రానీకేసెప్పేది. బేగిల్లి పెళ్ళెత్తిపెంటల బొయ్యి ఇప్పటికే అలపొద్దేళ దాటిపోనాది' ' అరిచాడు.

"నేనెల్లిపోతాను. మా అయ్యొస్తాడు". అన్నాడు మెల్లగా.

"ఎక్కడకెల్లావురా? ముందు సీపురుతియ్యి" వీరయ్య కదల్లేదు. శివయ్య కోపం తారాస్థాయికి చేరింది. వాడి జుట్టు పట్టుకుని ఊపేసి ఎడాపెడాకొట్టాడు. అయినా వాడుకదల్లేదు. కోపం ఆపుకోలేకపోయాడు. అక్కడ దూడకికట్టిన పలుపుకనిపిస్తే దాంతో గొడ్డును బాదినట్టు బాదాడు. వీరయ్య కిర కిరాచుట్టుకున్నాడు. భూమి ఆకాశం దద్దరిల్లినట్లుగోలచేసాడు. " అయ్యో! నాయినో! సచ్చిపోన్నానో, సంపెత్తన్నాడ్రో"' అని తిట్లులంకించుకున్నాడు.

చుట్టుపక్కల జనం ఈ దృశ్యాన్ని వినోదంగా చూస్తున్నారు. తనను తిట్టినందుకు శివయ్య వెర్రెత్తిపోతున్నాడు. వీరయ్య వెనక్కిచూడకుండా పరుగెత్తుకొని ఇంటికొచ్చేసాడు.

- ఇదీ అక్కడ జరిగింది. కథంత విన్న వీరయ్య అన్న భూషయ్య నాగుపాములా బుసలు కొట్టాడు. 'ఆడుమనిషా? పశివా? ఆడికి బూవులూ, తోటలూ ఉంటే ఆడేటి భగవంతుడను కుంతన్నాడా? ఇయ్యాలటో ఇటో తేల్చిపారెత్తాను అని.

జీవితమంతా దెబ్బలు తినితిని రాటుదేలిన దేవయ్య అనుభవసారంతో - "ఉరే అయ్యా! పేదాడి కోసం పెదవికే సేట్రా. ఆబుగతకాడ మనం డబ్బులు తెచ్చుకున్నాం. తలమ్ముకున్నాం. ఈడు నాల్రో జులైనా పన్లోకెల్లనేదు. తప్పు మందేరా ఆడెల్లస్పోతే మనవైనా ఎల్లినాంగాదు. ఎల్తేయింత రబస జరిగుండేది కాదు. నానెల్లి అయ్యగారి కాలొట్టుకుంతాను. నువ్వెల్లకురా! అని ఎంత మొత్తుకున్నా భూషయ్య వినలేదు. సర్రునలేచాడు. "ఒరే అయ్యా! అనిగిమనిగి ఉన్నంతకాలం బతుకింతేన్రా, నిత్తెం సచ్చేకంటే ఒక్క పాలే సత్తే మేలురా అతగాడేటి సంపేత్తాడేట్రా? పోనీ సంపీసినాడనుకో, అప్పటికైనా మన కులపోళ్ళు కల్లు తెరుస్తారు. ఈ బాడిసరకం మానేసి ఏవో పన్లు సూనుకుంతారు." అని భూషయ్య సౌరుషంగా శివయ్య మీదకు పరుగెత్తాడు. రాబోయే ఉపద్రవాన్ని ముందుగానే ఊహించిన భూషయ్య అతని వెనకే నడిచాడు. పొగాకునముల్తూ.

పులిలా కనిపించిన భూషయ్యను, పిల్లిని చూసినట్లే చూస్తూ " ఒరే ఓరి బికార్నాకొడకా! ఆగుంటనాకొడుకు కాల్లూ సేతులూ ఇరిపి పోగులు పెట్టప్పోతే నా పేరు శివయ్య కాదురా అయినా నువ్వెందుకొచ్చినావురా?" అరిచాడు.

" నాన్నీకొడకు పన్జెయ్యడానికి రానేదు. అటో, ఇటో తేల్చుకో నానికొచ్చినాను".

"ఏట్రా! ఏట్రా! నువ్వుతేల్సుకోనేది? అని దుడ్డుకర్రతో మీదకి ఉరుకుతున్న శివయ్యని అడ్డుకొని అతని చేతిలోని కర్రనిలాగి", ఆగు ఏటి బూకామందునని తెగమిడిసి పడిపోతున్నావు. ఏటి పన్లోకి రాపోతే పేనాలు తీసేస్తావేటి? " అని. అంటుండుగా దేవయ్య వచ్చాడక్కడికి.

"ఏట్రా సిన్న కొడుకు చేత తిట్లు తిట్టించి, పెద్ద కొడుకును తిరగబడమని పంపినా వేట్రా? ఒరే! మీ పేట పేటకి వాల ఇనాసికాలం వచ్చిందిరా! అనేసి "ఉరే నర్సింలూ,ఎంకట్లూ సూస్తారేట్రా, ఈనా కొడుకులనిరిసికట్టి - సితకబాదండిరా!" అన్నాడు.

భీషణ సమరం జరగబోయే సమయంలో కర్ణం కామేశ్వర్రావు రావటం - అప్పటికే పక్కగ్రామాలు కులాల కుమ్ములాటలతో భగ్గుమనటం గమనించి - మరోకార్చిచ్చు ప్రమాదాన్ని చాకచక్యంతో అరికట్టాడు. శివయ్యకు దేవయ్య ఇవ్వాల్సిన అప్పు వడ్డీలతో కలిపిన మొత్తానికి భూషయ్య యజమానిమీద తిరుగుబాటు చేసినందుకు జరిమానా కింద దేవయ్య ఎకరం పొలం శివయ్యకు చెందినట్లు పంచాయతీ చేసారు. పెద్దల సమక్షంలో.

కొన్నాళ్ళు దేవయ్య కుటుంబానికి ఊర్లో ఎవరూ పనిలోనికి రానివ్వలేదు. ఆకలిపేగులతో అవురావురుమన్నారు. ఇంటిల్లిపాది. భూషయ్య పక్క పల్లెలకు వెళ్ళి ఎండికట్టెలు మోపులు కట్టి - వాటిని అమ్మితే - రెండు రోజులకో పూట బత్తెం సంపాదించటం కష్టంగా ఉండేది.

ఊరికి రెండు మైళ్ళదూరంలో రోడ్డు దగ్గర వెంకన్న టీ కొట్టు దగ్గర కట్టెలమ్మిన భూషయ్యతో " ఒరే బూషిగా మీ తమ్ముడు ఈరిగాడు ఎక్కడున్నాడ్రా? అడిగాడు.

" ఇంటికాడే ఉన్నడు".

"కాళీ ఏనేట్రా?".

" కాళీకాకపోతే ఉద్యోగం సేస్తాడా ఏటి? బొడ్డాడనిగుంటడు".

" అది కాదురా! గలాసులు కడగడానికి నాకెవులూ దొరకడం నేదు. పంపించురా, కాఫీ, టిపిన్లు, బోయనం మాకాడే అయిపోద్ది రోజుకు రెండు రూసాయిలిత్తాను". అన్నాడు.

ఇదీ బాగుందనుకుని భూషయ్య వీరయ్యని పనిలోనికి చేర్చాడు. ఓరోజు శివయ్య రోడ్డు కొచ్చాడు. వెంకన్న టీ కలిపి ఇచ్చాడు. టీ త్రాగి గ్లాసు ఇస్తున్న శివయ్య ఆ గ్లాసు అందుకున్న వీరయ్యని చూసి తేలుకుట్టినట్లయి. "ఒరే ఎంకా! ఈ డెందుకురా ఇక్కడున్నాడు?" గద్దించాడు.

"గళాసులుకడగనానికెవలూ నేరుదద్దా! అందుకని... నసిగాడు.

"అయితే ట్రా! ఈలు ముట్టుకున్న గళాసుల్లో మీంతాగి ఈలు కడిగిన పేటుల్లో టిపినీ సెయ్యాలా అని చేతిలో గ్లాసు నేలకేసి కొట్టాడు. వీరయ్య బతుకు మళ్లీబద్దలయ్యింది. భూషయ్య సౌరుషం మరోసారి చితికిపోయింది.

ఇంతలో-

ఆ ఊళ్ళో తమకులానికే చెందిన రాజప్పడు మేష్టారు రావటం వీరయ్యను పట్నంలో- స్కూల్లో జాయించేసి - హాస్టలు సీటు యిప్పించారు. అంతలోనే ఊళ్ళో మాంగనీసు గని పని ప్రారంభించారు. రాజప్పడు మేష్టారు పలుకుబడితో భూషయ్యను నైట్‌వాచ్‌మన్‌గా వేయించాడు. దేవయ్య, పెళ్ళాం, గని పని చేసుకుంటున్నారు. రోజులుబాగున్నాయి. అనుకుంటున్న సమయంలో

ఓ రాత్రి భూషయ్య తల్లి కడుపు నొప్పితో చాలా బాధపడిపోయింది. చచ్చిపోయిందే అనుకున్నారు. ఆ రాత్రుల్లా దేవయ్య ఇంట్లో జాగరమే అయిపోయింది. ఎలాగైతేనేం బతికి బయటపడింది. ఆమెబతికి బయట పడింది కానీ కుటుంబం మళ్లీ వీధినిపడింది.

తెల్లారిలేచి భూషయ్య ఆఫీసుకెళ్ళేసరికి - గదిలో ఉన్న గోడ గడియారం లేదు. వాటర్‌ఫిల్టర్ లేదు. గాడ్రేజ్ కుర్చీలేదు. స్టీలు బిందెలేదు. మేనేజరు - రాత్రి డ్యూటీకి రాలేదని కేకలేసాడు. భూషయ్యని.

ఆ తరువాత డ్యూటీ సరిగా చెయ్యలేదని భూషయ్యనిపన్లొంచి తొలగించారు. ఓరోజున పొద్దున్న తొమ్మిదవుతుండగా పోలీసులొచ్చారు, దేవయ్య ఇంటికి. దేవయ్య అప్పుడే లేచి పలకర్ర చేస్తున్నాడు.

"భూషయ్య ఉన్నాడా?" అడిగాడు హెడ్‌కానిస్టేబుల్.

జనం మూగిపోయారు. భూషయ్య బయటికొచ్చాడు. హెచ్.సి. ఇల్లంతా సోదా చెయ్యమని కానిస్టేబుల్సుకు హుకుంజారీచేసాడు.

వాళ్ళు ఇల్లంతా వెతికారు. ఏం దొరకలేదు. ఇంటి ముందుగడ్డికుప్పలు వెతికారు. బిందె దొరికింది. ఇంకా వెతికారు గడియారం దొరికింది.

హెచ్.సి.భూషయ్యను లారీతో మొణుకుల మీద కాళ్ళ మీద ప్రాణంపోయినట్లు కొట్టాడు. దేవయ్య ఆ దెబ్బల్ని చూడలేకపోయాడు.

" బాబూ! ఇందులేదో మోసం ఉంది. మాకేపాపం తెల్డు ఆణ్నికొట్టకండి". అని హెచ్.సి. కాళ్ళమీద పడబోతే దేవయ్యని నెత్తి మీద లాఠీతో కొట్టాడు. చెయ్యని నేరానికి భూషయ్య జైలు పాలయ్యాడు. గని పని కెళ్ళిన దేవయ్య కుటుంబమ్మీద దొంగ ముద్రపడటంతో పనిలోనికి రానివ్వలేదు.

మళ్ళీ పరిస్థితి మామూలే!

దేవయ్య తల్లి ఊరూరా ముష్టికెళ్ళి - ఆ సంపాదనతో పిల్లలకి - కుటుంబానికి ఇంతతిండి పెట్టేది.

ఆరు మాసాల జైలు శిక్షతరువాత వచ్చిన భూషయ్యను అక్కున చేర్చుకుని "నేనుముందే సెప్పి నాన్రా! ఆల్లు గోప్పోల్రా! ఆల్తో తగూలు మనకెందుకురాని. ఆలు తల్చుకుంటే ఏదైనా సేత్తార్రా. మనకుటుమానం మీద ఎంతకచ్చ కట్టినాడోసూడ్రా! దొంగతనం కూడా అంటగట్టి నాడ్రా. ఇప్పటి కైనా మించి పోయింది నేదురా! సెమాపనసెప్పేసి ఆరికాలి దగ్గర పడేడుద్దాంరా! " అని నెత్తి నోరు కొట్టుకున్నదేవయ్యను చూసి భూషయ్య

"అయ్యా! నాకో ఆలోసనొచ్చిందిరా, అలాసేద్దామా?".

"ఏట్రా?" ఆసక్తితో కొడుకు కళ్ళలోకి చూసాడు దేవయ్య. "తెల్లారీ సరికి ఇంటిల్లిపాదీ ఆ శివయ్య గోరి పెద్ద నూతిలబడి సచ్చిపోదామా? మనకి బాదా ఉండదు - ఆడికికచ్చా ఉండదు". అన్నాడు. దేవయ్యకొడకు మీద పడిపడి ఏడ్చాడు.

చీకట్నే లేచి తయారయాడు భూషయ్య.

"ఎక్కడికిరా? " అన్నాడు భయంగా దేవయ్య

" అయ్యా! నేను పడమటెల్తాను. అక్కడేదో డూటీలో సేరతాను. నేనొచ్చిందాకా బగమంతుడు పాణాలుంచితే .. బతికితే మిమ్మల్ని తీసుకుపోతాను, అంతవరకు ఏదో నాగబతకండి.' 'అని వెళ్ళిన భూషయ్య ఆరు మాసాల తరువాత తిరిగి వచ్చాడు. వచ్చినవాడు మంచి బట్టలతో వచ్చాడు నిగారింపుగా. చేతినిండా డబ్బుతో వచ్చాడు. ఊర్లోఉన్న చిన్నచిన్న అప్పులు తీర్చుసాడు. నాల్రోజుల్లో పడమట బయలుదేరిసాడు. పడమటలో బతుకు బాగుపడింది. నాలుగు రాళ్ళు వెనకేసాడు. నాలుగు కాసులున్న వాళ్ళు భూషయ్యకు పిల్లనిచ్చారు. వీరయ్య వీరేష్ అయ్యాడు. ఉద్యోగస్తురాలికి పెనిమిటి అయ్యాడు.

" తాతా! నాయనమ్మ భోజనానికి పిలుస్తున్నాది. ఎంత పిలుస్తున్నా పలకవేంటి? " అన్నాడు అవినాష్.

" పిల్చారా! ఏటోరా ఇందాకల నుంచి మీ మాట వింటున్నాను. అదే ఆలోచిస్తున్నాను. నాకు తెలీకడుగుతాను. అమెరికావోడు అప్పుయివ్వప్పోతే సచ్చిపోతామట్రా?" అడిగాడు దేవయ్య.

"మామూలుగానా!? మలమలమాడి. అయినా తిండానికి తిండే కరువయిన మనదేశం అణ్వస్త్రాలు కనిపెట్టడం దేనికి తాతయ్యా అగ్రరాజ్యాల సహకారం లేకపోతే మనం ఒక్కడుగు ముందుకెయ్యలేం. అన్నాడు. చైతన్య.

" ఉరే అబ్బాయిలూ! అణుబాంబులు కనిపెట్టడం సంగతి అలా ఉంచండ్రా! నానోమాటంటా. నాకు మీ అంతగేనం నేదుకానీ సాలా కాలంకిందట మనం ఓ పల్లెటూళ్ళో ఉండే వాల్లం అక్కడే బూకా మందు శివయ్య గోరని ఉండేవారు. అతగాని కెదురు తిరిగాడు మీ అయ్య గొప్పోల కెదురు తిరిగి బతకలేమన్నాను నేను. మీ అయ్య సెట్! ఊల్లేదన్నాడు. ఎదిరించాడు. దానికి ఫలితంగా తిండీ తిప్పలు నేకముష్టిత్తుకున్నాం. మీ ఆయ్యజైలుకెల్లినాడు. ఏటి.. ఏ తప్పు సెయ్యకుండా - అయినా పవురుసంతో ముందు కెల్లినాడు. మీ సిన్నాయిన్ని సదివించినాడు. ఉజ్జోగస్తుల్నీ సేసినాడు. ఆనాడు అలా సొతంత్రంగా ఆడుబతకాలనుకోసాతే.. మీరూ పేడకళ్ళేత్తుకునో.. పాసిసన్లు చేసికానో బతకాల్సినవాళ్లే కాదంటూరా!? అన్నాడు దేవయ్య.

ఎవ్వరూ మాటాడలేదు.

" మరందు నుంచి గొప్పోడెప్పుడూ, తక్కువోడి గొప్పతానాన్ని సూళ్ళేడు. ఆల్లనీడలు మన మీద పడినంతకాలం... ఆ నీడ మన్ని ఎదగనివ్వ కంటా సేస్తాదే గాని ఎదగనివ్వదు... మనం కూడా ఒకరి దయా దరమబిక్షతో బతకనానికే అలవాటు పడిపోకూడదురా! సొతంత్రంగా బతకనానికి ఆలోసించాలి. ఏటంతారు? అన్న తాతయ్య అనుభవం ముందు వాళ్ళ యూనివర్సిటీ డిగ్రీలు వెలవెలబోయాయి.

వాళ్ళ మెదళ్ళు ఇప్పుడు పదునెక్కుతున్నాయి.

(26-9-1999 'ఈనాడు' ఆదివారం సంచికలో ప్రచురింపబడినది).

❀ ❀ ❀ ❀